నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**బంగారు పర్వతం**

ఎరెబస్ పర్వతం అంటార్కిటికా ఖండంలో ఉంది. ఇది బంగారాన్ని వెదజల్లుతుందని నాసాకు చెందిన భూ పరిశీలన ఉపగ్రహం గుర్తించింది. నిత్యం 80 గ్రాముల బంగారం బయటకు వస్తుందని, దీని విలువ 6000 డాలర్ల వరకు ఉంటుందని వెల్లడించింది. దక్షిణార్ధ గోళంలో ఇది అత్యంత క్రియాశీల అగ్ని పర్వతం. ఈ పర్వతాన్ని 1841లో రాస్ అనే వ్యక్తి కనుగొన్నాడు. ఇది అంటార్కిటికాలో అత్యంత ఎత్తయినది.

nipuna
Every Wednesday Free Supplement
1 మే 2024
పేజీలు 8

## అంతర్జాతీయం

**యూఎన్ఎస్సీ**

- పాలస్తీనాకు ఐక్యరాజ్యసమితిలో పూర్తి స్థాయి సభ్యత్వాన్ని ఇచ్చేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. దీంతో ఈ తీర్మానం వీగిపోయింది.

**సిప్రీ నివేదిక**



- సైనికీకరణకు సంబంధించి స్టాక్ హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సిప్రీ) ఒక నివేదికను విడుదల చేసింది. 2023లో సైన్యానికి వ్యయం చేసిన జాబితాలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. తొలి మూడు స్థానాల్లో వరుసగా అమెరికా, చైనా, రష్యా ఉన్నాయి. భారత్ తన సైనిక వ్యవస్థకు చేసిన వ్యయం 83.6 బిలియన్ డాలర్లు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచ సైనిక వ్యయం భారీగా పెరిగింది. ఇది 2443 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

**యూఎన్ఎఫ్పీఏ**

- దీని పూర్తి రూపం- యునైటెడ్ నేషన్స్ ఫండ్ ఫర్ పాపులేషన్ యాక్టివిటీస్. ప్రస్తుతం ప్రపంచంలో జనాభా పరంగా భారత్ అగ్రస్థానంలో ఉందని ఈ సంస్థ తెలిపింది. భారతదేశ ప్రస్తుత జనాభా 144.17 కోట్లు. రెండో స్థానంలో ఉన్న చైనా జనాభా 142.5 కోట్లు. భారత జనాభా 77 సంవత్సరాల్లో రెండింతలవుతుందని ఈ సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది.

**యూరోపియన్ పార్లమెంట్**

- వాయు నాణ్యతను మెరుగుపరిచేందుకు కొత్తగా నియమావళిని యూరోపియన్ పార్లమెంట్ ప్రవేశపెట్టింది. 2030 నాటికి కచ్చితంగా ఈ లక్ష్యాన్ని చేరుకోవడం ప్రధానాంశంగా ఉంది. వాతావరణానికి హాని కలిగించే ఎన్నో కలుషితాలను కట్టడి చేయనున్నారు. ఈ నియమావళిని అతిక్రమించిన దేశాలపై పౌరులు చట్టబద్ధంగా చర్యలు తీసుకోవచ్చు.

**ప్రపంచ వాతావరణ సంస్థ**

- వాతావరణం, రుతుపవనాల ఆధారంగా ప్రపంచంలో అత్యధికంగా విపత్తులను ఎదుర్కొంటున్న ఖండంగా ఆసియా ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ ఖండంలో 2023లో సంభవించిన విపత్తుల్లో 79 నీరు, వాతావరణానికి సంబంధించినవని పేర్కొంది. వీటివల్ల మృతుల సంఖ్య దాదాపు 2000 వరకు ఉంది. సైబీరియా, మధ్య ఆసియా, తూర్పు చైనా, జపాన్ దేశాల్లో విపరీతంగా వేడి పెరుగుతుందని కూడా ఈ సంస్థ వెల్లడించింది.

**భూతాప నివేదిక**

- ప్రపంచ వాతావరణ సంస్థ మరో నివేదికను కూడా విడుదల చేసింది. ఈ ప్రపంచంలో అత్యంత వేగంగా వేడెక్కుతున్న ఖండంగా యూరప్ ఉందని వెల్లడించింది. ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదల కంటే రెట్టింపు స్థాయిలో వేడెక్కుతుందని పేర్కొంది. పారిశ్రామికీకరణ కంటే ముందున్న ఉష్ణోగ్రత కంటే గడిచిన ఐదు సంవత్సరాల్లో ప్రపంచమంతా 1.3 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగితే, యూరప్లో 2.3 డిగ్రీల సెంటిగ్రేడ్ పెరిగిందని వెల్లడించింది.

**ఆర్టెమిస్ అకార్డ్స్లో స్వీడన్**

- ఆర్టెమిస్ అకార్డ్స్లో సంతకం చేసిన 38వ దేశంగా స్వీడన్ నిలిచింది. అంతరిక్ష పరిశోధనకు సంబంధించిన ఈ ఒప్పందాన్ని నాసా చేపట్టింది. భారత్ కూడా దీనిపై సంతకం చేసింది.

**ఆస్ట్రేలియా రక్షణ వ్యూహం**

- జాతీయ రక్షణ వ్యూహం-2024 పేరుతో కొత్త విధానాన్ని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రకటించింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అత్యున్నత భద్రత భాగస్వామిగా భారత్కు హోదా కల్పించింది. రక్షణ రంగంతో పాటు సమాచార రంగంలో కూడా భారత దేశంతో ద్వైపాక్షికంగా, బహుళ వ్యవస్థల్లో కలిసి పనిచేస్తామని వెల్లడించింది.

**రువాండా ఆశ్రయ చట్టం**

- రువాండా ఆశ్రయ చట్టాన్ని యూకే ఆమోదించింది. రువాండా శరణార్థులు చాలా మంది యూకేకు వచ్చిన నేపథ్యంలో వాళ్లందరినీ వెనక్కు పంపేందుకు ఉద్దేశించింది ఈ చట్టం. చార్టర్ విమానాల ద్వారా వలస వచ్చిన వారిని తిరిగి వారి దేశానికి పంపనున్నారు.

**సోడియం బ్యాటరీ**

- క్షణాల్లో చార్జింగ్ అయ్యే సోడియం అయాన్ బ్యాటరీని దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. లిథియం అయాన్ బ్యాటరీల కంటే ఇవి తక్కువ వ్యయం కావడంతో పాటు మెరుగ్గా పనిచేస్తున్నాయి.




## రోజులు- ప్రాధాన్యతలు

**ఏప్రిల్ 25**




- ఏటా మలేరియా రోజును ఏప్రిల్ 25న నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయడం, సమ ప్రపంచాన్ని సాధించడం'.

**ప్రతినిధుల రోజు**

- ఏప్రిల్ 25ను ప్రతినిధుల రోజుగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. దీన్నే ఇంగ్లిష్లో డెలిగేట్స్ డే అంటారు. దేశాల ప్రతినిధులు ఐక్యరాజ్యసమితిలో ఉంటూ ఎన్నో చర్చలు, ఒప్పందాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో వారి కోసం ఈ రోజును ఎంపిక చేశారు.

**ఏప్రిల్ 24**

- జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా భారత రాజ్యాంగంలో స్థానిక పరిపాలన వ్యవస్థను ప్రవేశపెట్టారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ 1993 ఏప్రిల్ 24న అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఏటా ఇదే రోజున పంచాయతీ రాజ్ రోజుగా నిర్వహిస్తారు. ఇదే రోజున ఏటా శాంతి కోసం దౌత్యం.. బహుళత్వ అంతర్జాతీయ రోజుగా నిర్వహిస్తారు.

**ఏప్రిల్ 23**

- వరల్డ్ బుక్-కాపీరైట్ డే గా నిర్వహిస్తారు. ఈ ఏడాది థీమ్ 'రీడ్ యువర్ వే'.

**ఏప్రిల్ 22**

- ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ డే గా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్స్'.

**ఏప్రిల్ 21**

- ఏటా ఏప్రిల్ 21న జాతీయ పౌర సేవల రోజు (నేషనల్ సివిల్ సర్వీసెస్ డే)గా నిర్వహిస్తారు. ఈ రోజును 2006లో ప్రారంభించారు. 1947 ఏప్రిల్ 21న నాటి భారత ఉప ప్రధాని, హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సివిల్ సర్వెంట్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ నేపథ్యంలో ఈ రోజును ఎంపిక చేశారు.

**కేన్స్ సినీ ఉత్సవం**

- ఫ్రాన్స్లోని కేన్స్లో జరిగే సినీ ఉత్సవానికి పుణెలోని ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా విద్యార్థి రూపొందించిన చిత్రం ఎంపికయ్యింది. 'సన్ఫ్లవర్స్ వర్ ది ఫస్ట్ వన్స్ టు నో' అనే పేరుతో చిదానంద్ నాయక్ ఈ చిత్రాన్ని తీశారు. 'లా సినెఫ్' అనే విభాగంలో ఈ చిత్రం పోటీ పడనుంది.

**ఫిలిప్పీన్స్కు బ్రహ్మోస్**




- బ్రహ్మోస్ క్షిపణులను ఫిలిప్పీన్స్కు విక్రయించనున్నారు. ఇది ఒక సూపర్ సోనిక్ క్షిపణి. భారత్, రష్యా కలిసి దీన్ని అభివృద్ధి చేశాయి. వీటిని మన దేశం నుంచి కొనుక్కుంటున్న తొలి దేశం ఫిలిప్పీన్స్. తొలి విడత ఎగుమతి ఇటీవల ప్రారంభించారు. బ్రహ్మపుత్ర, మాస్కో నదుల పేరు మీదుగా దీనికి ఆ పేరు పెట్టారు. శివథాను పిళ్లైని బ్రహ్మోస్ క్షిపణి పిత అని పిలుస్తారు.

## జాతీయం

**క్లైమేట్ క్లాక్**

- ఏప్రిల్ 22న మదర్ ఎర్త్ డే సందర్భంగా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) సంస్థ క్లైమేట్ క్లాక్ను ఆవిష్కరించింది. ఇది దేశంలో అతిపెద్దది. వాతావరణ అంశాలను సూచించేదే క్లైమేట్ క్లాక్. దీని ద్వారా ఎంత వేగంగా భూతాపం ఉంది. ఎంత కార్బన్-డై-ఆక్సైడ్ను విడుదల చేస్తున్నాం తదితర విషయాలను తెలుసుకొనేందుకు వీలుంటుంది.

**అవయవదానానికి నిబంధనలు**

- అవయవదానానికి సంబంధించి కేంద్ర వైద్య-కుటుంబ మంత్రిత్వ శాఖ కొత్త నిబంధన తీసుకొచ్చింది. జీవించి ఉన్న లేదా మరణించిన వారి నుంచి అవయవాలు స్వీకరించినప్పుడు దాత, గ్రహీతలకు ఐడీ నంబర్ను కేటాయించాలని నిర్ణయించింది.

**శోంపెన్ సామాజిక వర్గం**

- అండమాన్ నికోబార్ దీవుల్లో ఉండే శోంపెన్ అనే సామాజిక వర్గం తొలిసారి లోక్సభ ఎన్నికల్లో పాల్గొన్నది. ఓటు వేసి ప్రజాస్వామ్య ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దాదాపు ఏడు మంది ఓటు వేశారు.

**గ్యాస్ బస్సు**

- భారతదేశంలో తొలి ద్రవీకృత సహజ వాయు బస్సును మహారాష్ట్రలో ప్రవేశపెట్టారు. డీజిల్తో నడిచే 5000 బస్సులను ఎల్ఎన్జీలోకి మార్చాలని కూడా మహారాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ నిర్ణయించింది. ఇందుకు కింగ్ గ్యాస్ అనే సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.



**తమిళ నాడు అగ్రస్థానం**

- ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఎగుమతిలో దేశంలో తమిళనాడు అగ్రస్థానంలో ఉంది. 9.6 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఆ రాష్ట్రం ఎగుమతి చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ నిలిచాయి.

**భౌగోళిక గుర్తింపు**

- ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తిరంగా బర్ఫీ, ధౌలాలో లోహాలతో తయారు చేసే వస్తువులకు భౌగోళిక గుర్తింపు లభించింది. భారత్లో ఈ గుర్తింపు పొందిన వస్తువుల సంఖ్య ఆధారంగా ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో 75 వస్తువులకు జీఐ ట్యాగ్ ఉంది.

## క్రీడలు

**యుజువేంద్ర చాహల్**

- ఐపీఎల్లో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్గా యుజువేంద్ర చాహల్ రికార్డు సృష్టించాడు. ఇతడు రాజస్థాన్ రాయల్స్ జట్టుకు చెందిన క్రీడాకారుడు. ముంబయి ఇండియన్స్తో జరిగిన మ్యాచ్లో అతడు ఈ ఘనతను సాధించాడు.

**గుకేశ్**

- క్యాండిడేట్స్ టోర్నీ గెలిచిన అతి చిన్న వయస్కుడిగా గుకేశ్ రికార్డు సృష్టించాడు. కేవలం 17 సంవత్సరాల వయసులో అతడు ఈ ఘనతను సాధించాడు. గతంలో కాస్పరోవ్ 22వ ఏట ఈ టోర్నీలో విజయం సాధించాడు. ఆ రికార్డును గుకేశ్ తిరగ రాశాడు. హికారు నరమురాను ఓడించి ఈ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రపంచ చాంపియన్షిప్లో డింగ్ లిరెన్తో గుకేశ్ పోటీ పడనున్నాడు.



## వార్తల్లో వ్యక్తులు

**గీతా సబర్వాల్**

- ఇండోనేషియాలో ఐక్యరాజ్యసమితి రెసిడెంట్ సమన్వయకురాలిగా భారత్కు చెందిన గీతా సబర్వాల్ను నియమించారు.

**నయీమా ఖాతూన్**

- అలీఘుర్ ముస్లిం యూనివర్సిటీకి వైస్చాన్స్లర్గా నయీమా ఖాతూన్ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ఈ బాధ్యత చేపట్టిన తొలి మహిళ ఆమె.



**ప్రబొవో సుబియాంటో**

- ఇండోనేషియా అధ్యక్షుడిగా ప్రబొవో సుబియంటో నియమితులయ్యారు. ఈ ఏడాది అక్టోబర్ 20న ఆయన బాధ్యతలను స్వీకరిస్తారు.

**ప్రగ్యా మిశ్రా**

- ఓపెన్ ఏఐ భారత్లో తొలి ఉద్యోగిని నియమించుకుంది. ప్రభుత్వంతో సంబంధాల కొనసాగింపునకు ఉద్దేశించిన విభాగానికి నాయకత్వ బాధ్యతలను ప్రగ్యా మిశ్రాకు అప్పగించింది.

**నళిన్ ప్రభాత్**

- నేషనల్ సెక్యూరిటీ గార్డ్కు డైరెక్టర్ జనరల్గా నళిన్ ప్రభాత్ను నియమించారు.

**సప్న తివారీ**

- ఇంటెలిజెన్స్ బ్యూరోకు స్పెషల్ డైరెక్టర్గా సప్న తివారీని నియమించారు.

**పావులూరి సుబ్బా రావు**

- అనంత టెక్నాలజీస్ వ్యవస్థాపకులు, సంస్థ చైర్మన్, సీఈవో పావులూరి సుబ్బారావుకు ప్రతిష్ఠాత్మక ఆర్యభట్ట అవార్డ్ దక్కింది. ఈ అవార్డును ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అందజేసింది.

**కౌశిక్ రాజశేఖర్**

- జపాన్కు చెందిన ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ అకాడమీ నుంచి ఇంటర్నేషనల్ ఫెలోషిప్ను భారత్కు చెందిన కౌశిక్ రాజశేఖర్ గెలుచుకున్నారు. ప్రస్తుతం ఆయన హూస్టన్ కులెన్ కాలేజీలో ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్నారు. రవాణా రంగాన్ని విద్యుదీకరించడంలో ఆయన చేసిన కృషికి ఈ ఫెలోషిప్ దక్కింది.

**మహ్మద్ సలేం**

- గాజాలో ఒక మహిళ తమ సమీప బంధువు అయిన బాలిక మృత దేహాన్ని పట్టుకొని రోదిస్తున్న ఫొటో తీసిన పాలస్తీనాకు చెందిన మహ్మద్ సలేంకు వరల్డ్ ప్రెస్ ఫొటో అవార్డ్ దక్కింది. రైటర్స్ సంస్థ తరఫున అతను పనిచేస్తున్నారు. 2023 అక్టోబర్ 17న ఈ ఫొటోను తీశారు.



వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

